కొప్పోల్ ఆలయం ముస్తాబు

- 25 నుంచి ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభం
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

పెద్దశంకరంపేట(మెదక్): భక్తుల కొంగు బంగారంగా ఉన్న కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయం ఉత్సవాలకు ముస్తాబవుతోంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏటా నాలుగు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా కొనసాగనున్నాయి. దీనికి గాను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు మెదక్, నిజామాబాద్, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతుంటారు. ఈ నెల ఫిబ్రవరి 25 నుంచి 28 వరకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు. పెద్దశంకరంపేట పట్టణం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొప్పోల్ ఆలయంలో ఉత్సవాలను ఈసారి అంగరంగ వైభవంగా చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. మహాశివరాత్రి సందర్భంగా జాతరతో పాటు బండ్ల ఊరేగింపు, రథోత్సవాన్ని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద ఉన్న కోనేటిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయాన్ని రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.


కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయం


ఆలయంలో వెలసిన ఉమాసంగమేశ్వరుడు

ఈ నెల 25 నుంచి ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభం మంగళవారం పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, హోమం, దుర్గాభవానికి అభిషేకం, కుంకుమపూజ, బుధవారం మహాశివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకాలు, రాత్రి లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు, గురువారం ఉమాసంగమేశ్వర స్వామి కల్యాణోత్సవం, సాయంత్రం బండ్ల ఊరేగింపు, శుక్రవారం పూర్ణాహుతితో పాటు రాత్రి 8 గంటల నిమిషాలకు రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

పెద్దశంకరంపేట నుంచి ప్రత్యేక బస్సులు

పేట నుంచి కొప్పోల్ ఆలయం వరకు నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడపనున్నారు. పేట బస్టాండ్ నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఆలయ ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే సంగమేశ్వర ఆలయ వార్షికోత్సవాలకు రావాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. రుద్రారం గ్రామంలో ఈ నెల 26 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, సిద్దిరాములు, ఆలయ కమిటీ సభ్యులు ఆకుల నవీన్, రవి, శ్రీనివాస్ ఉన్నారు.

వైభవంగా ఆత్మలింగ ప్రతిష్ఠోత్సవాలు


ఉత్సవాలలో పాల్గొన్న బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి గిరి మహారాజ్

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో ఆత్మలింగ ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 27 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. శనివారం బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్, బిచ్కుంద ఆశ్రమ పీఠాధిపతి కీని మహారాజ్, దుద్యాల ఆశ్రమ పీఠాధిపతి సర్వేశ్వర మహారాజ్ ఉత్సవాల్లో పాల్గొని భక్తులను ఆశీర్వదించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

సామూహిక సీమంతాలు


సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని అంగన్‌వాడీ–1 కేంద్రంలో శనివారం ఈసీసీఈడే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రసాదం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు


దీక్షల్లో పాల్గొన్న జేఏసీ నాయకులు

నర్సాపూర్: ప్రభుత్వం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తివేయాలన్న డిమాండ్‌తో నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి ఆరవ రోజుకు చేరాయి. దీక్షలకు సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ డంప్‌యార్డుతో ప్రజలు ఇబ్బందుల పాలవుతారన్నారు. డంప్‌యార్డు పెట్టడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నందున ప్రభుత్వం అక్కడి నుంచి డంప్‌యార్డును తరలించాలని కోరారు. దీక్షలలో జేఏసీ నాయకులు రాజేందర్, మోహన్ రెడ్డి, రిజ్వాన్, మల్లేశ్‌యాదవ్, కొండికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటాపాటలతో ప్రాథమిక విద్య


హైదర్‌గూడ అంగన్‌వాడీలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శివకుమారి

తూప్రాన్: పట్టణ పరిధిలోని హైదర్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈడే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివకుమారి మాట్లాడుతూ.. 3–6 సంవత్సరాల చిన్నారుల్లో మెదడు పురోగతి చాలా వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భాల్లో చిన్నారులకు ఆటాపాటలు, కథలు సృజనాత్మకత – సాంస్కృతిక, కార్యక్రమాలు ప్రతీరోజు అంగన్‌వాడీ కేంద్రంలో నేర్పిస్తామన్నారు. పిల్లలు స్వేచ్ఛ ఆటలతోటి పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు నేర్చుకోవడం వల్ల వారి శారీరక, మానసిక అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్ లత, ఇందిరా, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం


అల్లాదుర్గం(మెదక్): చిల్వేర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


నర్సాపూర్:అహ్మద్‌నగర్ పాఠశాలలో స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


తూప్రాన్: వెంకటాయపల్లిలో..


రామాయంపేట మంజీరా విద్యాలయంలో...

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మంజీరా విద్యాలయంలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. తొమ్మిదో తరగతికి చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి కింది తరగతికి చెందిన విద్యార్థులకు పాఠాలు చెప్పారు. డీఈవోగా మహతి, హెచ్‌ఎంగా విశాలి, సాయిస్వరూప్ ఎంఈవోగా వ్యవహరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ కుమార్, కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అహ్మద్‌నగర్ పాఠశాలలో ..

నర్సాపూర్: మండలంలోని అహ్మద్‌నగర్ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో శనివారం స్వయంపాలన వేడుకలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా, హెచ్‌ఎంగా, ఎంఈఓగా వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేశ్, ఉపాధ్యాయులు సయ్యద్‌పాషా, ముకుందరావు, శ్రీహర్ష రెడ్డి, రమ్య, అరుణదేవి తదితరులు

వెంకటాయపల్లిలో..

తూప్రాన్: మండలంలోని వెంకటాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం హెచ్‌ఎం శారద ఆధ్వర్యంలో జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధిరాములు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిల్వేర ప్రాథమిక పాఠశాలలో..

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చిల్వేర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఇందులో ఏఈఓగా శివకుమార్, హెచ్‌ఎం బిందు, ఉపాధ్యాయులుగా హర్షిత్, శ్రీవాణి, రేవతి, నక్షత్ర, స్వప్న, అక్షయ్, హర్షవర్ధన్, అక్షిత్‌లు టీచర్లుగా బాధ్యతలు చేపట్టారు.

నేడు పలు మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని రామోజిపల్లి, బూర్గుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఏఈఓ యాసిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతున్నామని, ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన సూచించారు.

మనోహరాబాద్(తూప్రాన్): 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్‌లో భాగంగా విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నట్లు విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మనోహరాబాద్, తూప్రాన్, మాసాయిపేట్, శివ్వంపేట్ మండలాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నేడు మదూర్ పరిధిలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మదూర్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మరమ్మతులు చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దినకర్ తెలిపారు. మదూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముత్రాజ్‌పల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ఎల్‌ఓసీలను శనివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి హైదరాబాదులోని ఆమె నివాసంలో అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఏజెంట్ల పెత్తనానికి అడ్డుకట్టవేయాలి

మెదక్ మున్సిపాలిటీ: ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్ల పెత్తనం అరికట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీఏ కార్యాలయం చుట్టూ ఏజెంట్లు గుమిగూడి వాహనదారులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇంతా జరుగుతున్నా.. పట్టించుకునే అధికారులే కరువయ్యారని తెలిపారు. ఏజెంట్లు లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వాహనదారులను అందినకాడికి దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ విషయంలో అధికారులు స్పందించిన తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చాకరిమెట్లలో టవర్ ఏర్పాటుకు నిర్ణయం


మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో బీఎస్‌ఎన్‌ఎల్ సలహా కమిటీ సభ్యులు

నర్సాపూర్: నియోజకవర్గ పరిధిలోని శివ్వంపేట మండలం చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ ఏర్పాటు చేసేందుకు శనివారం జరిగిన బీఎస్‌ఎన్‌ఎల్ సలహా కమిటీ సమావేశంలో నిర్ణయించారని సంస్థ సలహా కమిటీ సభ్యుడు సురేశ్ తెలిపారు. శనివారం సంగారెడ్డిలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అధ్యక్షతన మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల బీఎస్‌ఎన్‌ఎల్ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకరిమెట్ల ఆలయం ఏరియాలో మొబైల్ సిగ్నల్స్ లేక దేవాలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తాను సమావేశంలో ఎంపీ, సంస్థ అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో దేవాలయం ఆవరణలో టవర్ ఏర్పాటుకు హామీ ఇచ్చారని చెప్పారు. నర్సాపూర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థకు చెందిన భవనాలు చాలా ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వ సంస్థలకు లేదా ఇతర సంస్థలకు అద్దెకు ఇచ్చి ఉపయోగంలోకి తేవాలని కోరారన్నారు. శివ్వంపేట మండలంలోని పలు తండాల ఏరియాలో కొత్త టవర్లు ఏర్పాటు చేయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారని వివరించారు.

గ్రామాల్లో సిగ్నల్ మెరుగు పరచాలి

చేగుంట(తూప్రాన్): గ్రామాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్‌ను మెరుగు పరచాలని అడ్వైజరీ కమిటీ సమావేశంలో కోరినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా టెలికం బోర్డు మెంబర్ రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బాలచందర్ తెలిపారు. శనివారం సంగారెడ్డిలో ఉమ్మడి మెదక్ జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా చేగుంట మండలంలో సగానికి పైగా గ్రామాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ రావడంలేదని సమావేశంలో మాట్లాడినట్లు వివరించారు. స్పందించిన జీఎం రాజరాజేశ్వరి మాట్లాడుతూ.. త్వరలోనే మండలంలో పర్యటించి సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇరచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్, జహీరాబాద్ ఎంపీలు రఘునందన్‌రావు, సురేష్‌షెట్కార్, బోర్డు మెంబర్లు పాల్గొన్నారు.


శివ్వంపేట(నర్సాపూర్): మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండల్‌రావు


చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిలు పద్మారెడ్డి, సులోచన

వెల్దుర్తి(తూప్రాన్): నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి బీజేపీ కృషి చేస్తుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పద్మారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సులోచన అన్నారు. ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలంతా అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం వెల్దుర్తిలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని నాయకులు, కార్యకర్తలకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం పలువురు పట్టభద్రులను కలిసి అంజిరెడ్డికి ఓటువేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దాసు, నాయకులు వెంకటేశం, శేఖర్‌గౌడ్, నవీన్, బాలకిషన్, మౌనిక, నర్సింలు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): బీజేపీ తరఫున ఎమ్మెల్సీలుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు సంతోష్, పాపన్నపేట మాజీ సర్పంచ్ ఇమానియల్, జిల్లా నాయకులు సుధాకర్, భాగేష్, వడ్ల భాగేష్ కోరారు. శనివారం వారు మండల పరిధిలోని మల్లంపేట, కందిపల్లి, మిన్‌పూర్, పాపన్నపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య, పట్ట భద్రుల అభ్యర్థిగా అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నార్సింగి మండల కేంద్రంలో ..

చిన్నశంకరంపేట(మెదక్): గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని ఓటువేసి గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి కోరారు. శనివారం నార్సింగి మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు లింగారెడ్డి, పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, నరేష్ తదితరులు ఉన్నారు.


వెల్దుర్తిలో బీజేపీ నాయకులు


పాపన్నపేటలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

శివ్వంపేట(నర్సాపూర్): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండల్‌రావు, మండలాధ్యక్షుడు రవి అన్నారు. శనివారం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమరయ్యకు మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సమస్యల సాధనకు బీజేపీ కృషి చేస్తుందని, ఆ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, అశోక్, భాస్కర్, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించండి


బోధనపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని పలు పాఠశాలలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, ప్రార్థన సమయానికి ముందే పాఠశాలకు రావాలని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. శనివారం ఆయన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు బోధన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులకు సులభమైన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధిస్తూ, వారికి కనీస సామర్థ్యాలు వచ్చేలా కృషి చేయాలి. ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక బోధనోపకరణాలను వినియోగించాలన్నారు. నైతిక విలువలను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిలప్‌చెడ్ హెచ్‌ఎం రమేశ్, చండూర్ హెచ్‌ఎం హరిసింగ్ ఉన్నారు.

పనులు చేయించాం.. పైసలు ఇప్పించండి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో ఏడాది కాలంలో పనులు చేయించగా, ఇంతవరకు డబ్బులు రాలేదని చేసిన పనులకు సంబంధించి పైసలు ఇప్పించాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది కాలంలో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా, పంచాయతీలకు ఇంతవరకు ఎలాంటి నిధులు రాలేదన్నారు. అయినప్పటికీ అప్పులు తెచ్చి గ్రామాల్లో ట్రాక్టర్ డీజిల్, పారిశుద్ధ్యం పనులు, నీటి సరఫరా, వీధిదీపాలు తదితర పనులకు డబ్బులు ఖర్చు చేశామని చెప్పారు. గ్రామాల్లో పంచాయతీ కార్మికుల వేతనాలు సైతం రాలేదన్నారు. గత ఏడాది లీజ్ తీసుకున్న బోరుబావుల డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. ప్రభుత్వం స్పందించి సమస్య తీర్చి డబ్బులు వచ్చేలా చూడాలని కోరారు.


వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎరువుల విక్రయాలు నిలిపేయండి


నోటీసులు ఇస్తున్న ఏఓ

కౌడిపల్లి(నర్సాపూర్): అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నారని ఎరువుల షాపు యాజమానికి విక్రయాలు నిలిపివేయాలని ఏఓ స్వప్న శనివారం నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. కౌడిపల్లికి చెందిన భాగ్యలక్ష్మి ఎరువుల షాపులో అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నారని పలుమార్లు ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. దీంతో ఇటీవల నోటీసులు ఇచ్చామన్నారు. అయినప్పటికీ మరోసారి ఫిర్యాదు వచ్చాయన్నారు. దీంతో డీఏఓ ఆదేశాలతో షాపు యజమానికి అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చేవరకు ఎలాంటి వస్తువులు విక్రయించొద్దని చెప్పారు. అనుమతి లేకుండా అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తూప్రాన్: పశువుల వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపూర్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వ్యాధులను గుర్తించి చికిత్సలు చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకుడు డాక్టర్ తిరుపతి, డాక్టర్ పున్నయ్య, సత్య సాయి సేవా సమితి సభ్యులు డాక్టర్ శ్రీనివాస్, పశువైద్యాధికారి లక్ష్మి, పశు వైద్య సిబ్బంది కృష్ణ కుమార్, లింగమూర్తి, అమరావతి, గోపాలమిత్రులు అశోక్ రామస్వామి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ అంగడి బజారు ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వరిగుంతం గ్రామంలో శనివారం నూతనంగా అంగడి బజారును గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. పరిసర గ్రామాలు, గిరిజన తండాల ప్రజల సౌకర్యార్థం, తాజా కూరగాయల కొనుగోలు, ప్రజా అవసరాలకు ఉపయోగపడే వస్తువులను అంగడి బజార్‌లో అమ్మకాలకు ఉంచారు.

◆ నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యకుమారి తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు జరిగే ఈ పరీక్షలకు 680 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు.

◆ బంగారు భవితకు ఇంటర్ సోపానం

పాపన్నపేట(మెదక్): విద్యార్థి జీవితంలో ఇంటర్ బంగారు భవితకు సోపానంగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ నర్సింలు అన్నారు. శనివారం పాపన్నపేట జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఫస్ట్ ఇయర్ విద్యార్థులు డ్యాన్స్‌లు చేసి అలరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు సతీష్, శ్రీనివాస్, సంతోష్ కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రమేశ్, సంధ్యారాణి, అరుణ, విజయ్‌కుమార్, రాములు, వందన, మృదుల, పాల్గొన్నారు.

◆ నేటి మాలమహానాడు సమావేశం

కౌడిపల్లి(నర్సాపూర్): ఉమ్మడి మెదక్ జిల్లా మాల మహానాడు సమావేశం ఈనెల 23న మెదక్‌లోని టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించనున్నట్లు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని మాల మహానాడు ముఖ్యనాయకులు విధిగా హాజరుకావాలని కోరారు.

◆ కాంగ్రెస్ నాయకుల ప్రచారం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటువేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నర్సింహరెడ్డి, మల్లేశం, సుధాకర్‌గౌడ్, శంకరయ్యగౌడ్, శేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ మున్సిపల్‌లో తాగునీటి ఎద్దడి



తూప్రాన్: వేసవి కాలం ప్రారంభలోనే తాగునీటి ఎద్దడి నెలకొంది. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌లోని పలు కాలనీల్లో తాగునీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా.. నీరు సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సరిపడా తాగునీరు అందించాలని కోరుతున్నారు.